రెండు నామినేషన్లు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 20 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి మూడో రోజు అయిన శనివారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏఐఎంఐఎం అభ్యర్థి షేక్ మున్న బాష, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి జి. రాకేశ్‌లు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. రవినాయక్‌కు సమర్పించారు. నాగర్‌కర్నూలు నియోజకవర్గంలో ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు.

సలేశ్వరం

- రేపటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు
- మరో అమర్‌నాథ్ యాత్రగా పేరు
- కొండలు ఎక్కుతూ.. లోయలు దిగుతూ స్వామి సన్నిధికి
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తుల రాక
- పౌర్ణమి రోజున పూజలు
- ప్రత్యేక బస్సులు నడుపనున్న ఆర్టీసీ

సాహస యాత్ర


అడవిలో నడుచుకుంటూ లింగమయ్య వద్దకు వెళ్తున్న భక్తులు(ఫైల్)

అచ్చంపేట, ఏప్రిల్ 20: నల్లమల అభయారణ్యంలో ఎత్తయిన కొండ దిగువన 1,000 అడుగుల లోతులో కొలువైన లింగమయ్య స్వామి సోమవారం నుంచి బుధవారం వరకు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ స్వామి దర్శనం అంటేనే సాహసోపేతమైన మరో అమర్‌నాథ్ యాత్రగా భక్తులు భావిస్తారు. అడవిలో కొండలు ఎక్కుతూ, లోయలు దిగుతూ, కొండ చరియల అంచున నడుస్తూ స్వామిని చేరుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ చెంచులే పూజారులుగా వ్యవహరిస్తారు. ఏడాదిలో మూడు రోజులు మాత్రమే జరిగే ఈ ఉత్సవాలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలొస్తారు. చిన్న పిల్లాడి నుంచి పండు ముదుసలి వరకు స్వామిని దర్శించుకునేందుకు ఉత్సాహం చూపుతారు. ఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజు మాత్రమే స్వామి దర్శనం ఉంటుంది. స్వామి దర్శనంతో తమ కష్టాలు పోయి మేలు జరుగుతుందని భక్తుల నమ్మకం. ఉత్సవాల కోసం నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు.

ఇక ఏడాదిలో 9 నెలలు దర్శనం

ఏడాదికి ఒక సారి జరిగే సలేశ్వరం ఉత్సవాలకు భక్తులు, పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వస్తుండటంతో నల్లమల జనసంద్రంగా మారుతోంది. గత ఏడాది ఉత్సవాలకు 7,800 ఫోర్ వీలర్ వాహనాలు, 600 ఆటోలు, 11 వేలకుపైగా ద్విచక్ర వాహనాలు వచ్చాయి. ఆర్టీసీ బస్సులు 797 ట్రిప్పులు తిరిగాయి. మూడు రోజుల్లోనే లక్షకుపైగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో తొక్కిసలాటలో పలువురు మృతి చెందారు. దాంతో ఏడాదిలో తొమ్మిది నెలలు స్వామి దర్శనం కల్పించేలా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. అటవీశాఖ సఫారీ టూర్‌లో భాగంగా రోజుకు 100 మంది చొప్పున క్షేత్ర దర్శనం కల్పించేందుకు పలు శాఖలతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. దాంతో సలేశ్వరం సమీపంలో చెంచులకు జీవనోపాధి కలుగనుంది.

కొండ వాలు వెంట రాళ్ల, రప్పలు దాటుకుంటూ నడవాలి. ఆ తర్వాత మరో 100 అడుగుల ఎత్తున్న కొండను దిగ్గి, 700 అడుగుల లోతున్న కొండ లోయలోనికి దిగితే కాని స్వామిని చేరుకోలేము. స్వామి వద్దకు నడుచుకుంటూ వెళ్లేటప్పుడు భక్తులు ప్రతీ ఒక్కరు చేతిలో కర్రలు పట్టుకుంటారు. ఆ కర్రలు లేకుంటే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఉంటుంది.

వెయ్యి అడుగుల లోతులో..

మహిమాన్విత లింగమయ్య స్వామి వెయ్యి అడుగుల లోతులో గల గృహలో కొలువు దీరాడు. 200 అడుగుల ఎత్తున్న మోకాళ్లకురువ దిగ్గి, దాదాపు కిలో మీటరుకు పైగా

జాగ్రత్తలు తప్పనిసరి

సలేశ్వరం దర్శనానికి వచ్చే భక్తులు పలు జాగ్రత్తలు పాటించాలి. గుండె జబ్బులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు రాకపోవడమే ఉత్తమం. వెంట మంచినీటిని తెచ్చుకోవాలి. చంటిపిల్లలను తీసుకరాకపోవడమే మంచిది. మోకాళ్ల కురువ నుంచి ఉదయం, సాయంత్రం లేదా రాత్రి వేళ నడకన సాగిస్తే త్వరగా అలిసిపోరు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పోలీసులు, అటవీశాఖ సూచనలు పాటించాలి.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మహిళలకు ఉచిత ప్రయాణం దృష్ట్యా సలేశ్వరం ఉత్సవాలకు భక్తులు ఈ సారి అధిక సంఖ్యలో తరలి వస్తారన్న అంచనాతో ఆర్టీసీ అచ్చంపేట డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపనుంది. దాదాపు 23 బస్సులను సలేశ్వరం జాతరకు నడుపనున్నట్లు డీఎం ప్రసాద్ తెలిపారు. అచ్చంపేట డిపోతో పాటు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా దేవరకొండ, మిర్యాలగూడ, హైదరాబాద్ నుంచీ ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు చెప్పారు.

ఎలా వెళ్లాలి?

సలేశ్వరం వెళ్లేందుకు హైదరాబాద్ నుంచి వచ్చే భక్తులు శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారి వెంట పరహాబాద్ చౌరస్తా వరకు చేరుకోవాలి. అక్కడి నుంచి అటవీ మార్గంలో 30 కిలో మీటర్లు ప్రయాణిస్తే సలేశ్వరం చేరుకోవచ్చు. అచ్చంపేట నుంచి వచ్చే వారు రంగాపూర్, మన్ననూర్ మీదుగా 70 కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. మరో మార్గంలో అచ్చంపేట నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న లింగాల చేరుకొని, అక్కడి నుంచి.. అప్పాయపల్లి మీదుగా గిరిజగుండాల వరకు 15 కిలో మీటర్లు వాహనాల్లో, ఆ తర్వాత మరో 15 కిలో మీటర్లు కాలి నడకన వెళ్తే సలేశ్వరం చేరుకోవచ్చు.


లింగమయ్య స్వామి

బావోజీ బ్రహ్మోత్సవాలు

- రేపటి నుంచి ఈ నెల 25వ తేదీ వరకు..
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వివిధ రాష్ట్రాల నుంచి రానున్న లంబాడా, గిరిజన భక్తులు
- దర్శించుకోనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర ప్రముఖులు


బావోజీ దేవాలయం

మద్దూర్, ఏప్రిల్ 20: నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన గిరిజనుల ఆరాధ్య దైవం గురులోక మాసంత్ ప్రభు(బావోజీ) బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు జరుగనున్నాయి. లోక కల్యాణార్థం ఎనిమిదో ఏట ఇంటి నుంచి బయల్దేరిన జావోజీ దేశంలోని వివిధ దేవాలయాలను దర్శించుకుంటూ, అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని దర్శించుకున్నారట. కఠోర నియమంతో 12 ఏళ్ల పాటు గ్రంథ పఠనం, తపస్సు చేసి, కాళికదేవి అనుగ్రహం పొందారట. మహారాష్ట్రలోని నాందేడ్ అడవిలో సంచరిస్తూ, ప్రజల కష్టాలు తీర్చారట. చివరకు తిమ్మారెడ్డిపల్లికి వచ్చి అక్కడున్న మర్రి చెట్టుకింద 12 ఏళ్లపాటు తపస్సు చేసి 17వ శతాబ్దంలో అక్కడే జీవసమాధి అయ్యారని లంబాడా, గిరిజనులు కథలు కథలుగా చెప్పుకుంటారు. అందుకే త్మిరెడ్డిపల్లిలో ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం నారాయణపేట, కోస్గి, తాండూరు, పరిగి, కొడంగల్, మద్దూర్ తదితర బస్టాండ్‌ల నుంచి పత్ర్యేక బస్సులు నడుపనున్నారు.


బావోజీ సమాధి

ఏర్పాట్లపై కలెక్టర్ దృష్టి

బావోజీని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష వివిధ శాఖల అధికాలతో సమావేశమై ఆదేశించారు. 220 మంది పారిశుధ్య కార్మికులు విధుల్లో పాల్గొనున్నారు. 88 ప్రత్యేక మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా, నిరంతరం విద్యుత్ సరఫరా, హెల్త్ క్యాంపు సౌకర్యాలను కల్పించనున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ పర్యవేక్షణలో పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, వందల మంది కానిస్టేబుల్స్, హోంగార్డులు బందోబస్తులో పాల్గొననున్నారు.

బ్రహ్మోత్సవాలు ఇలా..

- 22న సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ధ్వజారోహణం, రాత్రికి బంజార భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.
- 23న మంగళవారం గురులోకమాసంత్, ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, భజనలు చేస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. అన్నదానం చేస్తారు. అదే రోజు రాత్రి రెండు గంటలను స్వామివారి రథోత్సవం ఉంటుంది.
- 24న బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు స్వామి వారికి పల్లకీ సేవ, ప్రత్యేక పూజలు ఉంటాయి.
- 25న గురువారం కాళికాదేవికి పల్లకీ సేవ, హోమం, పూర్ణాహుతి, మంగళ హారతి తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తెలిపారు.

ఖరారు కాని సీఎం పర్యటన

సొంత నియోజకవర్గంలో జరుగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బావోజీని సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకోనున్నారని తెలుస్తోంది. రేవంత్‌రెడ్డి పలుమార్లు ఎమ్మెల్యే హోదాలో స్వామిని దర్శించుకున్నారు. సీఎం పర్యటన త్వరలో ఖరారు కావచ్చని అధికార వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా కర్ణాటక మంత్రులు, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా బావోజీని దర్శించుకోనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో

ఇందిరమ్మ రాజ్యం తెస్తాం

- రాజకీయాలకతీతంగా ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు


కుడికిళ్ల గ్రామంలో ఎంపీ ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, ఏప్రిల్ 20 : రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో త్వరలోనే ఇందిరమ్మ రాజ్యం తెస్తామని , రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ పేదవారిని తానే స్వయంగా గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి గెలుపు కోరుతూ కొల్లాపూర్ మండలంలో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అంకిరావుపల్లి, కుడికిళ్ల, నార్లాపూర్, ముక్కిడిగుండం, బోడబండతండా, ఎల్లూరు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఓటర్లనుద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ తప్పక నెరవేరుస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తైన తర్వాత ఇల్లులేని ప్రతీ పేదవాడికి పార్టీలకతీతంగా నిజమైన లబ్ధిదారులను తానే స్వయంగా ఎంపిక చేసి, వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని జూపల్లి పేర్కొన్నారు.

శ్రీవారి సన్నిధిలో 'చల్లా' కుటుంబం

- తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20: మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కుటుంబ సభ్యులు శనివారం తిరుమల వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. వంశీచంద్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం తిరుమల దర్శనానికి బయల్దేరి వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర, పాలమూరు ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామి కోరుకున్నానని చెప్పారు.


తిరుమల దేవస్థానం వద్ద చల్లా వంశీచంద్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఓటమి భయంతో డీకే అరుణ: కాల్వసుజాత

ఓటమి భయంతో డీకే అరుణ మహిళా సెంటిమెంట్ తెస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి కాల్వ సుజాత అన్నారు. ఓడిపోతానని తెలిసే మహిళలకు చేతెలెత్తి నమస్కరిస్తుందన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుజాత మాట్లాడారు. రేవంత్‌రెడ్డి తిట్టాడని ఆమె సింపతీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పండబెట్టి తొక్కుతానని డీకే అరుణను అన్నట్లు ఉంటే తానే వచ్చి క్షమాపణ చెబుతానన్నారు. సీఎం.. పార్టీలను తొక్కుకుంటూ పోతామని అన్నారని గుర్తు చేశారు. మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, రూ.500కే సిలిండర్ అమలు చేస్తున్నామని, త్వరలో మహిళలకు రూ.2,500 ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళలు పార్టీని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారని అన్నారు. వాళ్లే రేపు అండగా నిలబడి కాంగ్రెస్‌ను గెలిపిస్తారన్నారు. నీవు మహిళవు అయినంత మాత్రాన మొత్తం మహిళలకు ఏదో జరిగిందని మాట్లాడటం సరికాదన్నారు. సీఎంను ఓటుకు నోటు కేసులో జైలుకు పోయినవ్ అంటున్నావని, నీవు లిక్కర్ దందా చేసి ఎంతో మంది జీవితాలను నాశనం చేశావని అన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ రాధాఅమర్, మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు బెక్కరి అనిత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- ఏం పాపం చేశానని తొక్కుతవ్?
- భాష మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకుంటారు
- సీఎంపై డీకే అరుణ ఫైర్

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20: పాలమూరు ఆడబిడ్డలకు చేతులెత్తి నమస్కరించి కోరుతున్నానని, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతున్న మాటలు.. మహిళ అని కూడా చూడకుండా అవమానిస్తున్న తీరును గమనించి ప్రతీ ఆడబిడ్డ ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. తనను కింద పండబెట్టి తొక్కుతానని సీఎం మాట్లాడుతున్నారని, ఏం పాపం చేశానని తొక్కుతావ్ అని ప్రశ్నించారు. శుక్రవారం ఆమె జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గద్వాల గడీల దొరసాని అని అంటారని.. నువ్వు దొరవని, నీ కుటుంబం దొర కుటుంబమని.. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని అన్నారు. చిట్టెం నర్సిరెడ్డి గురించి మాట్లాడే తాహతు నీకున్నదా? అని అన్నారు. నర్సిరెడ్డి బిడ్డగా ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశానన్నారు. కేసీఆర్‌ను తిట్టినట్లు అరుణమ్మను తిడతానంటే చూస్తూ ఊరుకోమని, ప్రజలు ఊరుకోరని ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఓటుకు నోటు కేసులో జైలు కెళ్ళి వచ్చిన నీ స్థాయి ఏంటో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. 'నా బండారం బయటపెడతాడట.. రా ఏ చౌరస్తాకు వస్తావో చూద్దాం? నీ బండరామో, నా బండారం బయటపడుతుందో చూద్దాం'అని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలలో ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏ హామీని అమలు చేశారో చెప్పాలన్నారు. 30 వేల ఉద్యోగాలు, పాలమూరుకు రూ.10 వేల కోట్లు ఎక్కడిచ్చారో చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి బాషను మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, రామాంజనేయులు, పోతుల రాజేందర్‌రెడ్డి, బురుజు రాజేందర్‌రెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన


సభా స్థలిని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి, మల్లు రవి తదితరులు

బిజినేపల్లి, ఏప్రిల్ 20 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించనున్న బహిరంగ సభకు సీఎం అనుమల రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బహిరంగ సభా స్థలిని మంత్రితో పాటు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మేఘారెడ్డి, గద్వాల జడ్పీ చైర్‌పర్సన్ సరిత పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ ప్రజలు ఒక గ్యారెంటీగా చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే.. ఐదు గ్యారెంటీలను అమలు చేసి ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో ముందుటామని హామీ ఇచ్చారు. వారి వెంట నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు హబీబ్, అమృత్‌రెడ్డి, గంగనమోని తిరుపతయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు, మిద్దె రాములు, డి.రామచందర్, వెంకటస్వామి, శ్రీనివాస్ బహదూర్, కత్తె ఈశ్వర్, అజీజ్, నసీర్ ఉన్నారు.

బోయలగూడెంలో గుడిసె దగ్ధం

గట్టు, ఏప్రిల్ 20 : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం బోయలగూడెం గ్రామంలో ఉప్పరి హన్మంతమ్మ గుడిసె శనివారం ఉదయం దగ్ధమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మంతమ్మ గుడిసెలో శనివారం ఉదయం 10 గంటల సమయంలో గ్యాస్‌స్టవ్ లీకేజీ కావడంతో దగ్ధమైంది. ప్రమాదంలో లక్ష రూపాయల నగదు, బియ్యం, వంట సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు, వెండి సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. పొలానికి చెందిన పట్టాదారు పాస్‌పుస్తకం కూడా పూర్తిగా కాలిపోయినట్లు బాధితురాలు తెలిపింది. సమీపంలో నీటి సౌకర్యం లేకపోవడంతో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కుటుంబం కట్టుబట్టలతో మిగిలింది. తహసీల్దార్ ఆదేశాలతో ఆర్ఐ పంచనామా నిర్వహించారు.

మునిసిపల్ చైర్మన్, కమిషనర్ వాగ్వాదం

» కార్యాలయంలో కొద్దిసేపు ఉద్రిక్తత

గద్వాల టౌన్, ఏప్రిల్ 20 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్, కమిషనర్‌కు మధ్య జరిగిన తీవ్ర వాగ్వాదంతో కార్యాలయంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పట్టణంలోని చైర్మన్ నివాసం వద్ద మునిసిపల్ జవాన్లు పనిచేశారన్న నెపంతో వారికి మెమోలు ఇస్తానని బెదిరించిన కమిషనర్ జీతాలు ఇచ్చేది ప్రభుత్వమని, చైర్మన్ కాదని చెప్పినట్లు వెలువడిన వార్త వాగ్వాదానికి దారి తీసింది. ఈ కారణంగా కమిషనర్‌ను తన చాంబర్‌కు పిలిపించుకున్న చైర్మన్ ఆ విషయం గురించి నిలదీయడంతో పాటు, కొంతకాలంగా కార్యాలయం సిబ్బంది పట్ల కమిషనర్ అనుసరిస్తున్న దురుసు వైఖరి గురించి ప్రస్తావిస్తూ తీరు మార్చుకోవాలని హెచ్చరించినట్లు తెలిసింది. అదే సమయంలో చైర్మన్‌తో పాటు పక్కనే ఉన్న మరో కౌన్సిలర్ కమిషనర్‌ను నెట్టివేసే ప్రయత్నం చేస్తూ దుర్భాషలాడారని తెలిసింది. దీంతో అంతే తీవ్ర స్థాయిలో స్పందించిన కమిషనర్ వారితో వాగ్వాదానికి దిగడంతో అది కాస్తా ఘర్షణ రూపం దాల్చుతుండటంతో ఇతర సిబ్బంది జోక్యం చేసుకుని వివాదాన్ని నిలువరించారు. కాగా, తన పట్ల దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడారని విషయాన్ని కలెక్టర్, ఎస్పీల దృష్టికి తెస్తానంటూ కమిషనర్ తన కార్యాలయం నుంచి బయటికి వెళ్లిపోయారు. ఆయన నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్‌తో సమావేశం కావడంతో చైర్మన్‌పై ఫిర్యాదు చేసేందుకు వెళ్లారని వార్తలు వెలువడ్డాయి.

దీనిపై చైర్మన్‌ను, కమిషనర్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించేందుకు ప్రయత్నించగా ఇద్దరూ అందుబాటులోకి రాలేదు. కాగా, తన చాంబర్‌లో ఎవరి మధ్య ఎలాంటి గొడవ జరగలేదని కమిషనర్ డి.శంకర్‌సింగ్ పేరున సోషల్ మీడియాలో వార్తలు వెలువడటం గమనార్హం.

జాతీయ స్థాయి టోర్నీలో సత్తా చాటాలి

» డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20 : జాతీయ స్థాయి హ్యాండ్ టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్ర జట్టును విజేతగా నిలిపేందుకు కృషి చేయాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు ముంబాయిలో జరగనున్న మినీ హ్యాండ్‌బాల్ నేషనల్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర బాల, బాలికల జట్లకు జిల్లా క్రీడాకారులు ఎంపికైయ్యారు. శనివారం జిల్లా స్టేడియం మైదానంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డీవైఎస్‌వో క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లాలోని క్రీడాకారులు పది మంది జాతీయ స్థాయి టోర్నీకి ఎంపిక కావటం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదన్నారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, సెక్రటరీ జియావుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్‌హుస్సేన్, పీడీ బాల్‌రాజ్, కోచ్‌లు సునీల్, పర్వేజ్, నర్సింహా, పీఈటీ రాధిక తదితరులున్నారు.



రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్లకు ఎంపికైన జిల్లా క్రీడాకారులతో డీవైఎస్‌వో శ్రీనివాస్

రాష్ట్ర బాలుర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

వరుణ్, జయవర్ధన్‌రెడ్డి, గోవింద్

రాష్ట్ర బాలికల జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

సుదీక్ష, లాస్యప్రియ, హర్షప్రియ, పారిజాత, జాహ్నవి, హర్షిణి, దీక్షిత

గద్వాలలో పట్టుచీరల చోరీ

» దొంగతనం చేసి పారిపోతుండగా వెంబడించి చీరలను లాక్కొన్న యజమాని

గద్వాల క్రైం, ఏప్రిల్ 20 : గద్వాల అంటేనే పట్టుచీరలకు ప్రసిద్ధి.. అలాంటి చీరలను కొనడానికి కొందరు ఇతర ప్రాంతాల నుంచి వస్తే.. మరికొందరు వాటిని దొంగిలించి పారిపోతుండగా యజమాని వెంట పడి లాక్కున్న సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి దుకాణ యజమాని వినోద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని కిష్టారెడ్డి బంగ్లా సమీపంలో ఉన్న విఘ్నేశ్వర వస్త్ర దుకాణంలో ఓ మహిళ, ఇద్దరు పురుషులు గద్వాల చీరలను కొనేందుకు దుకాణానికి వచ్చారు. అయితే అప్పుడు దుకాణంలో వినోద్ తాత లక్ష్మీనారాయణ ఒక్కడే ఉండటంతో ఆ ఇద్దరు పురుషులు అతన్ని మాటల్లో పెట్టి బయటకు తీసుకువచ్చారు. అదే సమయంలో మహిళ 10 చీరల దాకా తన కడుపులో దాచిపెట్టుకొంది. చీరలు బాగాలేవని చెబుతూ వారు తెచ్చుకున్న కారులో వెళ్తుండగా అప్పుడే వచ్చిన వినోద్‌కు తాత జరిగిన విషయం చెప్పాడు. దీంతో వినోద్‌కు వారిపై అనుమానం వచ్చింది. వెంటనే సీసీ కెమెరాను పరిశీలించగా చీరలు దొంగతనానికి గురైయ్యాయని గ్రహించాడు. ఆ వెంటనే కారులో వెళ్తున్న వారిని చూసి తన బైక్‌తో వెంబడించాడు. గద్వాల సమీపంలోని జమ్మిచేడు వద్ద కారు వద్దకు చేరుకున్న వినోద్ చీరల చోరీపై వారిని ప్రశ్నించాడు. నీ చీరలను ఇస్తామని పక్కకు ఆగమని కారులో ఉన్నవారు చెబుతూ పారిపోయేందుకు యత్నించగా వినోద్ వారిని అలాగే వెంబడించాడు. కొద్దిదూరం వెళ్లగా కారులో ఉన్న వారు ఒక చీరను, మరికొద్ది దూరం వెళ్లాక మరో చీరను, ఇంకా కొద్దిదూరం వెళ్లాక మరో చీరను ఇలా మూడు చీరలను రోడ్డుపై పారవేయడంతో వాటిని తీసుకునేందుకు ప్రతీచోట బైక్‌ను ఆపి వారిని వెంబడించగా అప్పటికే వారు పరారయ్యారు. ఈ విషయంపై వినోద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సీబీఆర్‌టీ పరీక్షా ఫలితాల్లో

అయ్యవారిపల్లి విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు


స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన నవీన్

మిడ్జిల్, ఏప్రిల్ 20 : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన కర్ణేకోట నవీన్ సీబీఆర్‌టీ పరీక్షా ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. టీఎస్‌పీఎస్సీ గతేడాది సెప్టెంబర్ నెలలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్ల నియామకానికిగాను కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ)పరీక్ష నిర్వహించింది. గ్రామానికి చెందిన నాగేశ్వర్, ఈశ్వరీబాయిల కుమారుడు నవీన్ ఈ పరీక్ష ద్వారా కెమిస్ట్రీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని ఓయూలో పీజీ పూర్తిచేసిన నవీన్ సివిల్స్‌లో రాణించాలనే ఉద్దేశంతో పట్టుదలతో చదివాడని అతని తల్లిదండ్రులు తెలిపారు. నవీన్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంకు రావడంపై గ్రామస్థులు అతన్ని అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భూత్పూర్, ఏప్రిల్ 20 : భూతగాదాల్లో అన్నదమ్ముళ్లతో గొడవ పడి మనస్తాపం చెందిన ఓ యువకుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామానికి చెందిన దేవరకొండ నర్సిములు(35) అదే గ్రామానికి చెందిన శైలజను 2008లో వివాహం చేసుకున్నాడు. అయితే నర్సిములుకు ముగ్గురు అన్నదమ్ములు ఉన్నారు. వీరికి రెండు ఎకరాల పొలం ఉండేది. నర్సిములు పెళ్లి సమయంలో ఎకరం పొలాన్ని ఆయన భార్యపేర చట్టపరంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. అయితే ఇటీవలే ముగ్గురు అన్నదమ్ములు భూమి విషయంలో గొడవ పడుతున్నారు. నర్సిములు ఈనెల 19వ తేదీన తన సొంత వ్యవసాయ పొలం వద్ద పనులు చేసుకోవడానికి వెళ్లాడు. భూతగాదాల విషయంలో కలత చెందిన నర్సిములు పొలం వద్ద ఉన్న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతన్ని జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్, డీసీఎం ఢీ

» యువకుడికి గాయాలు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 20 : బైక్‌ను డీసీఎం ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడు గాయాలకు గురైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం యాపట్లతండాకు చెందిన నవీన్ తన బైక్‌పై సాతాపూర్ నుంచి యాపట్లతండాకు వెళ్తుండగా కొల్లాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో నవీన్‌కు మోకాళ్ల చిప్ప పగిలి తీవ్ర గాయాలకు గురయ్యాడు. గాయపడిన నవీన్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రమాద ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై సతీష్ తెలిపారు.

రెండు లారీలు ఢీ

» ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు

కృష్ణ, ఏప్రిల్ 20 : ఎదురెదురుగా వచ్చిన లారీలు ఢీకొని ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలైన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గూడెబల్లూరు గ్రామ శివారులోని 167వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై నావిద్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి రాయచూరుకు వెళ్తున్న లారీ, కర్ణాటక రాష్ట్రం నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్లకు తీవ్ర గాయా లు కాగా స్థానికులు తమకు సమాచారమందించారన్నారు. ఇద్దరు డ్రైవర్లను రాయచూరులోని రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అలంపూర్ చౌరస్తా/వీపనగండ్ల, ఏప్రిల్ 20 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కర్నూల్‌కు చెందిన కొందరు వ్యక్తులు పుల్లూరు గ్రామంలో మద్యం తాగేందుకు వచ్చారు. బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2500లు లభించినట్లు తెలిపారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. అదేవిధంగా, వనపర్తి జిల్లా గోపల్‌దిన్నె గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై దినకర్ తెలిపారు. తమకందిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడులు చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వారివద్ద నుంచి రూ.33వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ వ్యర్థాల పట్టివేత

కేటీదొడ్డి, ఏప్రిల్ 20 : కర్ణాటకలోని రాయచూరు నుంచి అక్రమంగా చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా ఎస్సై శ్రీనివాసరావు పట్టుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం ఇర్కిచేడు పరిసరాల్లో శనివారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కర్ణాటక నుంచి బొలేరో వాహనంలో 10 క్వింటాళ్ల చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవరు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వ్యక్తి రిమాండ్

పాన్‌గల్, ఏప్రిల్ 20 : వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం మహ్మదాపూర్ గ్రామానికి చెందిన పుచ్చల పరమేశ్వరరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వేణు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పరమేశ్వర్‌రెడ్డి అతని కుటుంబ సభ్యులపై నాలుగు రైస్‌మిల్లులు ఉన్నాయి. మహమ్మదాపూర్ గ్రామంలో తన కోడలు అనూషరెడ్డి పేరిట ఉన్న ఎంఎస్ ఇషాన్ ఆగ్రోటెక్ రైస్‌మిల్లులో పథకం ప్రకారం పుచ్చల పరమేశ్వర్‌రెడ్డి అతని కుమారుడు మధుకుమార్‌రెడ్డి సివిల్ సప్లై కార్పొరేషన్ వారితో కస్టమ్ మిల్లింగ్ రైస్ గురించి ఒప్పందం చేసుకొని బియ్యాన్ని తిరిగి వారికి ఇవ్వకుండా సివిల్ సప్లై కార్పొరేషన్‌ను, ప్రభుత్వాన్ని మోసం చేసి బహిరంగ మార్కెట్‌లో రూ.మూడు కోట్ల 25 లక్షలకు అమ్ముకొని లాభం పొందారు. దీనిపై అధికారుల ఫిర్యాదు మేరకు డీఎస్పీ వెంకటేశ్వరరావు విచారణ చేపట్టి పుచ్చల పరమేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు. కుమారుడు పుచ్చల మధుకుమార్‌రెడ్డి కోడలు అనూషరెడ్డిలు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు.

కమ్మిన మేఘం..తగ్గని ఉబ్బరం

» ఉమ్మడి పాలమూరు జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు, తడిసిన ధాన్యం
» తగ్గని గరిష్ఠ ఉష్ణోగ్రతలు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/వనపర్తి అర్బన్/గద్వాల టౌన్, ఏప్రిల్ 20 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం ఉదయం నుంచే వాతావరణం చల్లగా ఉన్నది. వాతావరణం మేఘావృతం అయినా, ఎండ లేకపోయినా ఉబ్బరం, ఉక్కపోత ఎక్కువగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. అక్కడక్కడ చిరు జల్లులు కురిసినా ఉష్ణోగ్రతలు మాత్రం తగ్గలేదు.

జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కేటిదొడ్డిలో 42.7 డిగ్రీలు, ఇటిక్యాలలో 42.2 డిగ్రీలు, రాజోలి 42.1 డిగ్రీలు, అలంపూరులో 41.9 డిగ్రీలు, అయిజలో 41.4 డిగ్రీలు, మానవపాడులో 40.8 డిగ్రీలు, ఉండవల్లిలో 40.6, మల్దకల్‌లో 40.2, గట్టులో 39.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వనపర్తి జిల్లాలో కొత్తకోటలో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పెద్దమందడి, చిన్నంబావిలలో 42.5, పాన్‌గల్ 42.3, అమరచింత 42.0, ఆత్మకూరు 41.5, ఘణపూర్ 41.4, గోపాల్‌పేట 41.2, వనపర్తి, శ్రీరంగాపూర్, మదనాపూర్ 41.1, పెబ్బేరు 40.7, వీపనగండ్ల 40.1, రేవల్లి, ఘణపూర్‌లలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.


వనపర్తి జిల్లా చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ట్రాక్టర్ సాయంతో నీటి నుంచి ధాన్యాన్ని వేరు చేస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో 42.5, కల్వకుర్తిలో 42.0, బిజినేపల్లిలో 41.9, కోడేరులో 41.8, ఉప్పునుంతలలో 41.6, పెద్దకొత్తపల్లిలో 40.8, అచ్చంపేటలో 40.5, తాడూరులో 40.1, నాగర్‌కర్నూల్‌లో 40.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


దేవరకద్ర మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలో 40 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. బాలానగర్‌లో 39.8, మూసాపేట, మిడ్జిల్‌లో 39.7, మహబూబ్‌నగర్‌లో 39 డిగ్రీలు నమోదైంది.

నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో 37 డిగ్రీలు, మక్తల్‌లో 36 డిగ్రీలు, నర్వలో 28 డిగ్రీలు, కృష్ణలో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

కురిసిన అకాల వర్షం తడిసిన ధాన్యం

దేవరకద్ర : శనివారం ఉదయం కురిసిన అకాల వర్షానికి ధాన్యం కల్లాల్లో తడిసిపోయింది. దేవరకద్ర మార్కెట్ యార్డుకు వచ్చిన ధాన్యం కూడా తడిసిపోయింది. మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారుల లోడింగ్ చేయకపోవడంతో తడిసింది.

చిట్యాల మార్కెట్ యార్డులో..

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : వనపర్తి జిల్లా చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. కష్టపడి పండించిన యాసంగి ధాన్యాన్ని రైతులు అమ్ముకోవడానికి మార్కెట్ యార్డుకు తెచ్చుకున్నారు. కానీ, హఠాత్తుగా కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో రైతులు పోసిన ధాన్యం తడిసిపోయింది. వర్షం నీళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ఆరబోసిన ధాన్యం అడుగు భాగానికి నీళ్లు చేరాయి. సమయానికి ధాన్యం మీద కప్పడానికి ఎలాంటి కవర్లు కూడా లేకపోవడంతో సుమారు 2000 బస్తాలు మేర ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు.

అధికారుల అండతో ప్రభుత్వ భూముల కబ్జా

» బాలానగర్ పెద్దచెరువు కింద అక్రమంగా వెలిసిన వెంచర్
» జూన్ నాలుగులోపు చర్యలు తీసుకోకుంటే రైతులతో కలిసి దీక్ష చేస్తా
» జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి


బాలానగర్ పెద్దచెరువుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 20 : అధికారుల అండదండలతో అక్రమార్కులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని, డబ్బులిస్తే ఏ పనైనా జరుగుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. ఇదివరకున్న ప్రభుత్వం, ఎమ్మెల్యేల హయాంలో అలాంటివి జరిగాయి కానీ ఇప్పుడు అలాంటివి జరగనివ్వనని స్పష్టం చేశారు. బాలానగర్ పెద్దచెరువు కింద ఉన్న కాలువను మళ్లించి రియల్ వ్యాపారులు భూమిని కబ్జా చేయడంతో పాటు కాలువ మళ్లించడం వల్ల అక్కడ ఉన్న రైతుల పొలాలు నీట మునిగే పరిస్థితి నెలకొందన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్దచెరువుపై ఎమ్మెల్యే పెద్దచెరువు కాలువ ఆక్రమణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సర్వే నెంబర్ 118లోని పెద్దచెరువు అలుగు కింద ఉన్న 18 ఎకరాల కాలువను డైవర్షన్ చేసి ఆ స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ చేస్తున్నారని అన్నారు. ఇక్కడ ఇదివరకు ప్రభుత్వ నిధులతో వైకుంఠధామం ఏర్పాటుచేసి ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారని, ఇప్పుడు ఆ వైకుంఠధామం కూల్చివేసి వెంచర్ వేస్తున్నారన్నారు. అసైన్డ్ భూమిని రశీదు లేకుండానే ఓ ఆర్సీ ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు అనుమతులి చ్చారని విమర్శించారు. ఇక మైనింగ్ ఏడీ చెరువును సందర్శించి 12 ఎకరాల్లో 12 ఫీట్ల కాలువకు మట్టిని బయటి నుంచి తెప్పించి కాలువను పూడ్చినందుకు రూ.5.12 కోట్ల సీనరేజీ చార్జీల కింద జరిమానా విధించారన్నారు. అదే మైనింగ్ ఏడీ జనగామకు బదిలీ అయ్యారని, బదిలీ అయ్యే ముందు తాను పెనాల్టీ వేసిన మట్టికి అది బయట నుంచి తీసుకురాలేదని, అక్కడే తవ్వి అక్కడే వేసినందున సీనరేజ్ చార్జీలు వర్తించవని రూ.5.12 కోట్ల జరిమానా చెల్లించాల్సిన అవసరం లేదని రిపోర్ట్ ఇచ్చారన్నారు. వీటిపై జూన్ నాలుగో తేదీలోగా అధికారులు చర్యలు తీసుకోవాలని లేకపోతే నాలుగో తేదీ నుంచి ఐదు వేల మంది రైతులతో తాను ఇక్కడే దీక్ష చేస్తానని తేల్చి చెప్పారు. ఇక ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేగా తనపై ఉందని తెలిపారు. దీనిపై సీఎస్, రెవెన్యూ సెక్రటరీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు.

ఇదిలా ఉండగా రాజకీయ కక్షలో భాగంగా తనను జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి టార్గెట్ చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, దోడ్లపల్లి ఎంపీటీసీ సభ్యుడు చించోడు అభిమన్యురెడ్డి అన్నారు. ఉమ్మడి మండలంలోని రాజాపూర్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో అభిమన్యురెడ్డి మాట్లాడారు. బాలానగర్ గ్రామ పంచాయతీలో గల సర్వే నంబర్ 118లో నిర్మించిన శ్మశానవాటికను గ్రామ పంచాయతీ తీర్మానం మేరకే కూలగొట్టడం జరిగిందన్నారు. ఇలాంటి విషయాలపై ఎంతవరకైనా సరే నిజానిజాలు తెలుసుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నానని, పూర్తి వివరణ ఇవ్వకపోతే పదివేల మందితో సీఎం ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

నగదు పట్టివేత

» చెక్‌పోస్టుల వద్ద కొనసాగుతున్న తనిఖీలు

వనపర్తి రూరల్, ఏప్రిల్ 20 : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామ శివారులోని తిరుమలాయగుట్ట ప్రాంతంలో శనివారం రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.లక్షా 50 వేల నగదును పట్టుకొని సీజ్ చేశారు. సవాయిగూడెం గ్రామానికి చెందిన సాని భాస్కర్‌రెడ్డి వనపర్తి నుంచి స్వగ్రామానికి టూవీలర్‌పై వెళ్తుండగా పోలీసుల తనిఖీల్లో భాగంగా నగదుతో పట్టుబడ్డాడు. తనిఖీలో ఏఎస్సై బాలయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాలానగర్ వద్ద రూ.70వేలు..

బాలానగర్ : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో పోలీసులు రూ.70 వేల నగదును పట్టుకున్నారు. ఏపీలోని అనంతపూర్‌కు చెందిన నిస్‌గప్ప కారులో రూ.70 వేలను తీసుకెళ్తుండగా తనిఖీలో స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

జలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద..

నారాయణపేట రూరల్ : నారాయణపేట జిల్లా పరిధిలోని జలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.లక్షా ఏడు వేల నగదును పట్టుకున్నారు. కర్ణాటక నుంచి వస్తున్న కర్నె గ్రామానికి చెందిన జగలింగం దగ్గర రూ.57వేలు, భైరంపల్లికి చెందిన కాశమప్ప వద్ద రూ.50వేలు పట్టుకుని సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పజెప్పినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

బుద్ధారం గండి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద..

గోపాల్‌పేట/ఆత్మకూర్/అమరచింత : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామ పరిధిలోని గండి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు దగ్గర పోలీసులు రూ.మూడు లక్షల 90 వేల నగదును పట్టుకున్నారు. తిమ్మాజిపేట మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన మలకెడి రాజేష్(బ్యాంకు మిత్ర) తన కారులో వస్తుండగా చెక్‌పోస్టు వద్ద పోలీసులు కారు ఆపి తనిఖీలు నిర్వహించారు. కారులో పట్టుబడ్డ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారం లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

అదేవిధంగా ఆత్మకూర్ మండలం కొత్తకోట వైజంక్షన్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలో ఆత్మకూరు నుంచి కొత్తకోట వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో రూ.లక్షా 11 వేలను పోలీసులు పట్టుకున్నారు. గద్వాల జిల్లా ధరూర్ మండలం మల్దొడ్డి గ్రామానికి చెందిన రాములు వద్ద రూ.51 వేలు, అదే గ్రామానికి చెందిన రంగన్న వద్ద రూ.60 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. అమరచింత మండలం నాగల్‌కడుమూర్ చెక్‌పోస్టు వద్ద శనివారం చేపట్టిన తనిఖీలో పట్టుబడిన రూ.లక్ష నగదును సీజ్ చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. నర్వ మండల కేంద్రం నుంచి అమరచింత వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రామచంద్రం అనే వ్యక్తిని తనిఖీ చేయగా నగదు దొరికిందని చెప్పారు.

నందిన్నె చెక్‌పోస్టు వద్ద..

కేటీదొడ్డి : జోగుళాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలం నందిన్నె చెక్‌పోస్టు వద్ద శనివారం నిర్వహించిన తనిఖీలో రూ.52వేలు పట్టుబడినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. రాయచూరు నుంచి తారాపురంకు వెంకటేష్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా నందిన్నె చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో నగదును పట్టుకున్నట్లు చెప్పారు.

పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద..

అలంపూర్ చౌరస్తా : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద చేపట్టిన తనిఖీల్లో రూ.62900లు నగదు పట్టుకున్నట్లు ఉండవల్లి ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. కర్నూల్ పట్టణానికి చెందిన ఇలియాజ్ శనివారం కర్నూలు నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళ్తుండగా సరిహద్దులో తనిఖీ నిర్వహించినట్లు చెప్పారు. అదేవిధంగా, ఏపీలోని ప్రొద్దుటూరుకు చెందిన జి.శివాజీ అనే బంగారు వ్యాపారి తన కారులో పుల్లూరు టోల్‌ప్లాజా మీదుగా బొంబాయి వెళ్తుండగా చేపట్టిన తనిఖీలో రూ.95,500 పట్టుబడినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు.

రాజోలి సరిహద్దు చెక్‌పోస్టు వద్ద..

రాజోలి : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్ర శివారులో సుంకేసుల డ్యాం అంతరాష్ట్ర సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.రెండు లక్షల నగదు పట్టుబడినట్లు రాజోలి ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. రాజోలికి చెందిన హరిబాబు అనే రైతు ఏపీ నుంచి తెలంగాణకు బైక్‌పై వస్తుండగా నగదును పట్టుకొని కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ కమిటీకి అందించినట్లు ఆయన చెప్పారు.


బాలానగర్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో ఎస్సై తిరుపాజి


బుద్దారం వద్ద డబ్బును సీజ్ చేస్తున్న పోలీసులు


తిరుమలాయగుట్ట ప్రాంతంలో పట్టుబడ్డ నగదును సీజ్ చేస్తున్న వనపర్తి రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి

డిండి ముచ్చటే లేదు

» పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకే పీఆర్‌ఎల్‌ఐ నీరు
» పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి

పాలమూరు, ఏప్రిల్ 20 : పాలమూరు-రంగారెడ్డి జిల్లాల ప్రజలకే పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ (పీఆర్‌ఎల్‌ఐ) ద్వారా తీసుకువచ్చే నీరు అందాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నల్గొండలోని డిండి ప్రాజెక్టుకు పీఆర్‌ఎల్‌ఐ నుంచి నీటిని తీసుకుపోయేందుకు నల్గొండ రాజకీయ నాయకులు పావులు కదుపుతున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. ఇప్పటికే నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజలు అనేక మార్లు భూములు, ఉపాధి కోల్పోయి అన్యాయానికి గురైన పరిస్థితి ఉన్నదన్నారు. డిండికి ఎస్‌ఎల్‌బీసీ, నాగార్జునసాగర్, బస్వాపూర్ నుంచి ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నప్పటికీ పీఆర్‌ఎల్‌ఐ నుంచి తీసుకునేందుకు కుట్రలు చేయటం సరికాదన్నారు. 2016లో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష కాంగ్రెస్‌పార్టీ దీనిపై గట్టిగా పోరాటం చేసిందని, నేడు అదే పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అదే తప్పు చేస్తే ఎలా ఊరుకుంటామని ప్రశ్నించారు. ప్రజల ఒత్తిడివల్ల జూపల్లి కృష్ణారావు నాయకత్వంలో అప్పటి 14 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు డిండి లింకు పేరుతో పాలమూరు-రంగారెడ్డికి నష్టం చేయవద్దని సీఎం కేసీఆర్‌కు లేఖ రాయటంతో పీఆర్‌ఎల్‌ఐని రెండు భాగాలుగా చేయకుండా, డిండి ప్రాజెక్టుతో లింకు చేయకుండా ఆగిపోయిందన్నారు. కానీ, నల్లగొండ జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిండి లింక్ ఏదుల నుంచి చేపడతామని మాట్లాడటం, దానికోసం అవసరమైన చర్చలు పై స్థాయిలో జరుగుతున్నాయని చెప్పడం సరికాదన్నారు. కేసీఆర్ చేసిన రీడిజైన్‌లను సవరించి మహబూబ్‌నగర్-రంగారెడ్డి జిల్లాలకు శాశ్వత పరిష్కారమెలాగో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించాలన్నారు. డిండి పేరుతో పాలమూరు నుంచి నీటిని తరలించటమంటే న్యాయమే లేదన్నారు. మరోసారి డిండి లింకును ముందుకు తీసుకురావటమంటే మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల వేళ్లతోనే మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల కళ్లు పీకేయటంలాంటిదన్నారు. పదేళ్ల పాటు బీఆర్‌ఎస్‌తో ఎలా పోరాటం చేశామో అదే పోరాటం కాంగ్రెస్ ప్రభుత్వంతో చేయాల్సి ఉంటుందన్నారు. ఆ పరిస్థితి రాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకోవాలని పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

నేటి నుంచి మద్దిమడుగులో

ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు


మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయం(అంతర చిత్రంలో) ఆలయంలో కొలువుదీరిన స్వామివారి మూలవిరాట్

అమ్రాబాద్, ఏప్రిల్ 20 : నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రంగాచారి శనివారం విలేకరులకు తెలిపారు. ఆదివారం ఉదయం త్రయోదశి విఘ్నేశ్వరుని పూజతో కార్యక్రమం ప్రారంభమై మంగళవారం రాత్రి స్వామివారి ఊరేంగిపుతో ఉత్సవాలు ముగియనున్నాయని ఆయన వెల్లడించారు. హనుమాన్ జయంతి ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులను తీర్చుకుంటారు. ఉత్సవాలకు హాజరుకానున్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా పదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం, మంచినీరు, తదితర ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.

కొనసాగుతున్న రాములోరి బ్రహ్మోత్సవాలు


స్వామివారిని గరుడ వాహనంలో ఊరేగిస్తున్న భక్తులు

చారకొండ, ఏప్రిల్ 20 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల అయోధ్యనగర్(గుట్ట)పై వెలసిన సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం రాత్రికి జరిగే (పెద్దరథం) బ్రహ్మోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. ఉదయం ఆలయ పూజారులు స్వామివారికి అభిషేకం, అర్చనాదులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ, ఈవో యెన్న శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు స్వామివారికి పంచామృతం, అభిషేకం, లక్ష పుష్పార్చన, అమ్మవార్లకు కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం స్వామివారికి సహస్రనామార్చన అనంతరం రాత్రి వివిధ రకాల పూలతో అలంకరించిన గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం రాత్రి నాగర్‌కర్నూల్‌కు చెందిన డాక్టర్ నర్సింహ ఆధ్వర్యంలో గుట్టపైన శ్రీనివాసం కల్యాణం గురించి భక్తులకు హరికథ చెప్పించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నిరంజన్, అర్చకులు మురళీధర్‌శర్మ, లక్ష్మణశర్మ, ప్రవీణ్‌శర్మ, అనంతరామశర్మ, గోపికృష్ణశర్మ, వేణుగోపాలశర్మ, రఘుశర్మ, జయప్రకాష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ దాడుల్లో మద్యం బాటిళ్ల పట్టివేత

మక్తల్/నారాయణపేట రూరల్/రాజోలి/అలంపూర్ చౌరస్తా/గద్వాల క్రైం, ఏప్రిల్ 20 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు నారాయణపేట జిల్లాలో దాడులు నిర్వహించారు. మక్తల్ మండలం బుత్పూర్ గ్రామంలో చెన్నయ్యగౌడ్ ఇంట్లో నిల్వ ఉంచిన రూ.76,160 విలువైన 43.75 లీటర్ల మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. చెన్నయ్యగౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా, పేట మండలం చిన్నజట్రం గ్రామానికి చెందిన కెంచె వెంకటేష్ పేట నుంచి తరలిస్తున్న రూ.8,500 విలువగల 9.72 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. అలాగే, పేట సుభాష్‌రోడ్డుకు చెందిన సురేష్‌గౌడ్ రూ.3,900 విలువ గల 15.6లీటర్ల లిక్కర్‌ను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే, జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం మాన్‌దొడ్డి గ్రామ శివారులో మద్యం తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ మాన్‌దొడ్డి నుంచి బైక్‌పై 36 లీటర్ల మద్యం తీసుకెళ్తున్నట్లు తమకందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. బీర్లు, క్వార్టర్లు, తదితర 12 రకాల మద్యాన్ని రాజోలి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అదేవిధంగా, అలంపూర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగాడుతున్న ఓ మహిళ వద్ద మద్యం లభించినట్లు ఎస్సై శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. నంద్యాల జిల్లా, సుగాలిమెట్ట గ్రామానికి చెందిన పార్వతిబాయి అనే మహిళ కర్నూలులో నివాసం ఉంటుంది. శనివారం ఆమె అలంపూర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగాడుతుండగా పోలీసులు తనిఖీ చేశారు. 10.80లీ మద్యం లభించడంతో స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడ్డ మద్యం విలువ రూ.11,200 అని చెప్పారు. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని మేలచెర్వు శివారులో మద్యాన్ని తరలిస్తున్న బోయ ఈశ్వర్‌పై కేసు నమోదు చేసినట్లు గద్వాల పట్టణ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గద్వాల మండల పరిధిలోని పూడురుకు చెందిన బోయ ఈశ్వర్ గద్వాల నుంచి 24.945 లీటర్ల మద్యాన్ని తీసుకెళ్తుండగా మేలచెర్వు చౌరస్తాలో పట్టుకొని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.17,880 ఉంటుందని చెప్పారు. ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలకు బయోమెట్రిక్ నమోదు


సింగారం గ్రామంలో బయోమెట్రిక్ నమోదు చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 20: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌మన్ సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం శనివారం మండల పరిధిలోని సింగారం గ్రామంలో సిద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చందాపూర్ సబ్ సెంటర్ ఆరోగ్య సిబ్బంది బయోమెట్రిక్ నమోదు చేశారు. సికెల్‌సెల్ అనేది రక్తంలో వచ్చే వ్యాధి అని దీనిని మానవ శరీరంలో గుర్తించి వ్యాధిగ్రస్తులకు హైడ్రాక్సీయూరియా అనే మందులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని ఆరోగ్య సిబ్బంది సుస్మిత తెలిపారు. గ్రామంలో 35 కుటుంబాలకు 100మంది బయోమెట్రిక్ నమోదు చేయడం జరిగిందన్నారు. ఆశ వర్కర్లు ఇందిర, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి నిత్య పూజ నిధికి లక్ష అందజేత

తిమ్మాజిపేట, ఏప్రిల్ 20 : తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామి నిత్య పూజ నిధికిగాను పెద్దకొత్తపల్లి గ్రామ నివాసి కొట్కూరు నితీష్‌రెడ్డి, భారతి వినాయ కరెడ్డిలు తమ వంతుగా శనివారం లక్ష రూపాయలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చిలుక రామచంద్రారెడ్డి, బాలస్వామి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పలువురు దాతకు అభినందనలు తెలిపారు. పురోహితులు హరిప్రసాద్‌శర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రతిభ చాటిన బావాజిపల్లి విద్యార్థులు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 20 : తిమ్మాజిపేట మండల పరిధిలోని బావాజిపల్లి యూపీఎస్ పాఠశాలలో నాల్గవ తరగతి ఇటీవల పూర్తి చేసుకుని గురుకుల ఫలితాల్లో తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎం.సమీక్ష, పి.యశస్వి, పి.భవ్యశ్రీ, ఎం.అర్చనలు గురుకుల పాఠశాలలో ప్రవేశించేందుకు అర్హత సాధించారు. గ్రామానికి చెందిన ఎంఎస్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు మంగా నిరంజన్ శనివారం ప్రోత్సాహకంగా ఒక్కొక్క విద్యార్థికిగాను ఒక వెయ్యి 116 రూపాయలు అందజేశారు. అనంతరం బావాజీపల్లి పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు సుధాకర్‌గౌడ్, పాఠశాల హెచ్‌ఎం.నిర్మలాదేవి, ఉపాధ్యాయులు లక్ష్మణ్, శివసాగర్, భారతి, ఆసియాబేగంలను సన్మానించి ప్రతి విద్యార్థి స్ఫూర్తితో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్‌గా తెప్ప శ్రీను



నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 20: జిల్లా కేంద్రానికి చెందిన తెప్ప శ్రీను లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్‌గా ఎన్నికయ్యాయి. శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో జరిగిన లయన్స్ క్లబ్ 8వ కన్వెన్షన్‌లో డిస్ట్రిక్ గవర్నర్స్ కోటేశ్వర్‌రావు చేతుల మీదుగా తెప్ప శ్రీను రీజినల్ చైర్మన్‌గా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తెప్ప శ్రీను మాట్లాడుతూ తనకు లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించడం హర్షనీయమని, తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను లయన్స్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా లయన్స్ క్లబ్ చీఫ్ పర్సన్స్ హకీం విశ్వప్రసాద్, రాజవర్ధన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ డిపోలో లక్ష్మే లక్ష్యం జెండావిష్కరణ

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 20: టీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో లక్ష్మే లక్ష్యం జెండాను డిపో మేనేజరు దేవరాజు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డ్యూటీ చేసే కండక్టర్లు, డ్రైవర్లు సమన్వయంతో పని చేసి రోజుకు లక్ష రూపాయలను అదనంగా తీసుకురావాలన్నారు. అందుకు లక్ష్మే లక్ష్యం కార్యక్రమం కింద ప్రతి స్టేజీ దగ్గర బస్సును 5, 6 మంది ప్రయాణికులను అదనంగా ఎక్కించుకోవాలన్నారు. ఈ చాలెంజ్ వచ్చే ఏడాది ఉగాది వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు అందరు సమన్వయంతో పని చేస్తే నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకుంటామని ఆయన అన్నారు. ఆర్టీసీ ఏఎంఎఫ్ భాస్కర్, టీఐ డీ.హెచ్.చారి, ఎస్.బి.రెడ్డి, ఏడీసీలు జె.శ్రీనువాసులు, యాదయ్య, జలీల్, వీ.ఎస్.నారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి, పుష్పమ్మ, మణెమ్మ, పెంటయ్య, అనిత, సెక్యూరిటీ హెడ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

వంగూరు, ఏప్రిల్ 20: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శనివారం వంగూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ భీమమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే అధికారులతో శాఖల వారిగా సమీక్షించారు. ప్రధానంగా తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే చర్చించారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య ఇతర ప్రజాసమస్యలు తలెత్తకుండా చుసుకోవాలన్నారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వైస్‌ఎంపీపీ సంధ్య, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, డీటీ వెంకటరమణ, ఎంపీడీవో విజయభాస్కర్, ఎంఈవో శంకర్‌నాయక్, ఏవో తనూజ తదితరులు పాల్గొన్నారు.

'పెత్తందారి పార్టీలతో బహుజనులకు అన్యాయం'

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 20: బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ వంటి పెత్తందారి పార్టీలతో బడుగు, బహుజనులకు ఎప్పటికీ అన్యాయం జరుగుతూనే ఉంటుందని నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ మంద జగన్నాథం అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం మంద జగన్నాథం మొదటి సారిగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా శనివారం రాత్రి జిల్లా బీఎస్పీ నాయకులు మంద జగన్నాథంకు ఘన స్వాగతం పలికారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్‌తో కలిసి ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంకుశ వాది కేసీఆర్, ఆయనను మించిన నియంతగా నేడు కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని, వాటి విధానాలు నచ్చక ఆత్మగౌరవం కోసం తాను బీఎస్పీలో చేరానని పేర్కొన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులను గుర్తించి బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఎంపీగా తనను గెలిపించాలని ఆయన కోరారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, రాష్ట్ర కోఆర్డినేటర్ బాలయ్య, జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి బోనాసి రాంచందర్, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇంచార్జీ కొత్తపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు


పాలెం వెంకన్న ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, ఏప్రిల్ 20 : మండలంలోని పాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. చైత్రమాసం శుక్లపక్షం ద్వాదశి కావడంతో సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తే భక్తుల కోరిన కోరికలు తీరుతాయని నమ్మకమని ప్రధాన అర్చకుడు కురవి రామానుజాచార్యులు తెలిపారు. అనంతరం ఆలయంలో అన్నదానం చేపట్టారు.

బస్టాండ్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

- పట్టించుకోని అధికారులు

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 20: మండల కేంద్రంలో బస్టాండ్‌లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, అచ్చంపేట వంటి ప్రధాన పట్టణాలకు వెళ్లే నాలుగు రహదారులు కలిసి ఉన్న పెద్దకొత్తపల్లిలో బస్టాండ్ లేకపోవడం వల్ల ప్రజలు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినిత్యం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లికి వివిధ గ్రామాల నుంచి వేలాదిమంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. వచ్చి పోయే వారికి బస్టాండ్ లేక ఉండడానికి నిల్వ నీడ లేక హోటళ్లు, టీ కొట్టు, వ్యాపార సంస్థలు, కూల్ డ్రింక్స్ షాపులను ఆశ్రయిస్తున్నారు. ఎండకు, వర్షానికి తట్టుకోలేక వ్యాపార సంస్థల ముందు తలదాచుకుంటున్నారు. అంతేకాకుండా బస్టాండ్ చౌరస్తాలో ప్రయాణికులకు నీటి వసతి లేదు. హోటళ్లకు వెళ్తే టీ, టిఫిన్ చేస్తే గానీ నీరు ఇవ్వడం లేదు. అలాగే బస్టాండ్ నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరయ్యాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల బస్టాండ్ కోసం స్థలం చూపించకపోవడంతో నిధులు వాపస్ వెళ్లాయి. పెద్దకొత్తపల్లిలో బస్టాండ్ నిర్మించాలని ఎన్నోమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు లేరని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో బస్టాండ్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బస్టాండ్ లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి



మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో బస్టాండ్ నిర్మిం చి ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి. బస్టాండ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించి బస్టాండ్ నిర్మించాలి. అదేవిధంగా బస్టాండ్ ఆవరణలో తాగునీటి వసతితో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

- బి.శ్రీనివాసులు, దేవునితిర్మలాపూర్

సలేశ్వరం జాతరలో చిరు వ్యాపారులకు అనుమతి

- ద్విచక్ర వాహనం నుంచి బస్సుల వరకు అటవీ టోల్ ఫీజుల నిర్ణయం

మన్ననూర్, ఏప్రిల్ 20: ఈ నెల 22 నుంచి 24 వరకు వరకు నల్లమల అభయారణ్యంలో జరిగే సలేశ్వరం జాతరలో చిరు వ్యాపారాలు నిర్వహించుకునే వారికి మన్ననూరు అటవీ రేంజ్ కార్యాలయంలో అనుమతి పత్రాలను రేంజ్ అధికారి ఈశ్వర్ అందజేశారు. జాతరలో రాంపూర్ నుంచి మెట్లు దిగే ప్రాంతం వరకు భక్తులను తరలించేందుకు 60ఆటోల వరకు అటవీశాఖ అనుమతి నిచ్చింది. శీతల పానీయాలు, తాగునీరు, టీ, స్నాక్స్ వంటి దుకాణాల నిర్వాహకుల నుంచి రూ.6000 డిపాజిట్ తీసుకొని అనుమతులిచ్చారు. పర్యావరణానికి ఆటంకం కల్గకుండా మూడు రోజులు వ్యాపారాలు ముగించుకున్న వారికి తిరిగి అట్టి రుసుములను ఇవ్వనున్నారు. రాంపూర్ వద్ద అన్నదానం చేసే దాతల వద్ద రూ.50 వేలు డిపాజిట్ చేయించుకున్నారు. ప్లాస్టిక్ ప్లేట్లలో కాకుండా మార్పుటాకులతో తయారు చేసిన ప్లేట్లను వాడాలని నిర్వాహకులకు అటవీ శాఖ అవగాహన కల్పించారు. ఈ ఏడాది అటవీ శాఖ తయారు చేసిన 10 వేలకు పైగా మార్పుటాకు ప్లేట్లు సలేశ్వరం జాతరలో అన్నదాన కేంద్రాలకు విక్రయించేందుకు సిద్ధం చేశారు. సలేశ్వరం వెళ్లే వాహనాలకు టోల్ ధరలను నిర్ణయించారు. బస్సు, ట్రాక్టర్, లారీ రూ.1000, కార్లకు రూ.500, ఆటోలకు రూ.300, ద్విచక్ర వాహనాలకు రూ.100 ధర నిర్ణయించారు. అడవిలో ఎక్కడా మంటలు వేయరాదని, బీడీ సిగరెట్ అంటించడం నిషేధమని, మద్యం సేవించడం నిషేధమని నిబంధనలు అతిక్రమించే వారిపై అటవీశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. అనుమతినిచ్చిన చిరు వ్యాపారులు, ఆటోలు, అన్నదాన కేంద్రాల నిర్వాహకులను శనివారం సాయంత్రం నుంచే సలేశ్వర క్షేత్ర పరిసరాలకు అనుమతించారు. వీరంతా ఈ నెల 24న రాత్రి అడవి నుంచి తిరుగు ప్రయాణమవ్వాలని అటవీ అధికారులు నిబంధనలు విధించారు. నల్లమల ప్రాంతంలోని శ్రీశైలం, సున్నిపెంట, దోమలపెంట, అమ్రాబాద్, మన్ననూరు, వటవర్లపల్లి, అచ్చంపేట ప్రాంతాల నుంచి మన్ననూరు అటవీ రేంజ్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్నారు. వారి ఐడీ ప్రూఫ్‌లను తీసుకొని అటవీ నిబంధనలకు కట్టుబడి వ్యాపారాలు చేసుకుంటామని అంగీకరించిన తర్వాతే జాతరకు వెళ్లే అనుమతులిచ్చారు. ఈ అనుమతి పత్రాల జారీలో డీఆర్‌ఓ రవి కుమార్ పాల్గొన్నారు.

అత్యధిక స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుంది

- ఎంపీ రాములు

అచ్చంపేట, ఏప్రిల్ 20: దేశంలో ప్రజలు మోదీ పాలన కోసం ఎదురుచూస్తున్నారని, అత్యధిక స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుందని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాభిమానం పొందిన నాయకుడు దేశవ్యాప్తంగా మోదీని గెలుపించుకునేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. భరత్ ప్రసాద్‌ను గెలిపించి మోదీకి కానుక అందించాలన్నారు. అచ్చంపేట ప్రజలు పది సంవత్సరాలుగా రాజకీయంగా అయోమయస్థితిలో ఉన్నారు.. భవిష్యత్తులో ఈ ప్రాంతం అభివృద్ధి చేందాలంటే భరత్ ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలుపించుకునేందుకు కార్యకర్తలు, ప్రజలు సిద్ధం కావాలన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు మాంగ్యానాయక్, రేణయ్య బాలాజీ, గోపాల్, చందులాల్, కృష్ణాచారి, అఖిల్‌పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

కొల్లాపూర్ : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపుతోనే కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిసాధ్యపడుతుందని నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ పేర్కొన్నారు.

శనివారం రాత్రి కొల్లాపూర్ పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న వ్యాపార సముదాయాల్లో ఉన్న వ్యాపారులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావుతో కలిసి బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ ఓటు అభ్యర్థించారు. అంతకు ముందు కొల్లాపూర్ మినీ స్టేడియంలో వాకర్లను కలిసి బీజేపీ మేనిఫెస్టోను వివరించి బీజేపీకి ఓటు వేయాల్సిందిగా కోరారు.



ప్రచారంలో భాగంగా చాయ్ అమ్ముతున్న ఎంపీ రాములు

సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్సు బృందం తనిఖీలు


మిల్లును తనిఖీ చేస్తున్న సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్సు బృందం సభ్యులు

కల్వకుర్తి, ఏప్రిల్ 20 : కల్వకుర్తి పట్టణంలోని లక్ష్మీవేంకట నరసింహస్వామి పారాబాయిల్డ్ ఇండస్ట్రీని హైదరాబాద్‌కు చెందిన సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్సు బృందం శనివారం తనిఖీ చేశారు. తనిఖీల్లో సీఎంఆర్ వడ్లకు సంబంధించిన లెక్కల్లో తేడాలను గుర్తించారు. మిల్లులో 23.3కోట్ల విలువ గల 2లక్షల 86వేల 694బస్తాలు తక్కువగా ఉన్నాయని గుర్తించారు. మిల్లు యజమానిపై సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్సు బృందం సభ్యులు చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అధికారులకు సిఫారసు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామికుమార్ తెలిపారు. తనిఖీల్లో డీఎం, మేనేజర్, టీటీలు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండి సేవలందించాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 20 : గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తూ సేవలందించాలని కల్వకుర్తి ఎంపీడీవో ఎస్.వెంకట్రాములు కోరారు. కల్వకుర్తి మండల పరిధిలోని సుద్దకల్, తుర్కపల్లి గ్రామ పంచాయతీల్లోని రికార్డులను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన తీరును అడిగి తెలుసుకున్నారు.

రేపు సమ్మర్ క్రికెట్ క్యాంపు ప్రారంభం

కల్వకుర్తి, ఏప్రిల్ 20 : కల్వకుర్తి పట్టణంలో మినీ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో సమ్మర్ క్రికెట్ క్యాంపు సోమవారం ప్రారంభిస్తున్నట్లు కల్వకుర్తి క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నెలరోజుల పాటు జరిగే సమ్మర్ క్రికెట్ క్యాంపు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అండర్-14, 16 ,19, ఓపెన్‌లో బాలబాలికలకు శిక్షణనివ్వడం జరుగుతుందని సుధాకర్ కోరారు.

'కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం'

ఊర్కొండ, ఏప్రిల్ 20: కేంద్రంలో బీజేపీ మూడోసారి ప్రభుత్వ ఏర్పాటు ఖాయమని నర్సంపల్లి మాజీ సర్పంచ్ నిరంజన్ గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని నర్సంపల్లి, గండ్ల గంటపల్లి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు కుడుముల శ్యాంసుందర్ రెడ్డి, వెంకట్ నర్స్, నరేందర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, బాలస్వామి గౌడ్, మహేందర్, రాఘవేందర్, తిరుపతి రెడ్డి, ఆనంద్ గౌడ్ రాజనారన్ రెడ్డి, తిరుమలేష్, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండలాగుడు పోటీలు

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 20: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని పుల్జాల గ్రామంలో ఎద్దుల బండలాగుడు పోటీ లను శనివారం కాం గ్రెస్ సీనియర్ నాయకులు కాశన్న యాదవ్, రామనా థం ప్రారంభించారు. ఉత్సవాలలో పెద్ద మొత్తంలో నగదు బహుమతి ప్రకటించడంతో ఆయా ప్రాంతాల నుంచి పోటీదారులు తమ ఎద్దులను పోటీలో దింపారు.

నేడు మాంసాహార విక్రయాలు నిషేధం

కల్వకుర్తి, ఏప్రిల్ 20 : మహావీర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం కల్వకుర్తి పట్టణంలో మాంసం విక్రయాలను నిషేధిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో మటన్, చికెన్‌షాపులు, చేపలు అమ్మేవారు తమ షాపులను మూసివేయాలని, ఎవరైనా ఈ ఆదేశాలను అతిక్రమిస్తే రూ.5వేల జరిమానాతో పాటు షాపులను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.

బీజేపీ విస్తృత ప్రచారం

తెలకపల్లి, ఏప్రిల్ 20 : మండల పరిధిలోని రాకొండ 180, 181బూత్‌లలో భారతీయ జనతా పార్టీ నాయకులు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి రావాలంటే ప్రతీ ఒక్కరు కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీజేపీ సీనియర్ నాయకులు ఎ.కృష్ణ, మండల అధ్యక్షుడు గన్నోజు నరేంద్రచారి, వార్డు మెంబరు ఎండి.ఖాదర్, రజియా, రాజు, జగన్‌చారి, పాండు, నరేందర్ తదితరులు ఉన్నారు.

సాతాపూర్‌లో పొట్టేళ్లు చోరీ

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 20: మండల పరిధిలోని సాతాపూర్ గ్రామంలో సంగనమోని సలేశ్వరంకు చెందిన గొర్రె పోటేళ్లు చోరీకి గురయ్యాయి. బాధితుడు తెలిపిన కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామానికి చెందిన సంగనమోని సలేశ్వరం తన గొర్రె పొట్టేళ్లను రోజు వారిగా పాకలో ఉంచా రు. శుక్రవారం రాత్రి ఆరు గొర్రె పోటేళ్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. సుమారు వాటి విలువ 80వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. శనివారం అచ్చంపేట సంతలో చోరీకి గురైన గొర్రె పోట్టేళ్లను దొంగలు విక్రయిస్తుండగా గ్రామస్థులు పట్టుకుని నిందితులను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిసింది.

శనీశ్వర స్వామి భక్తుల ప్రత్యేక పూజలు


నందివడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, ఏప్రిల్ 20 : సార్థసప్త శనీశ్వర స్వామి భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నల్లని నువ్వులు, తిల తైలాలతో భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్‌లోని సార్థా సప్త జేష్టదేవి సమేత శనీశ్వర స్వామికి క్రోధి నామ సంవత్సరం చైత్రమాసం శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అయల ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ జన్మ, గోదార రీత్యా గ్రహదోషాలు ఉన్న వారు ఏలినాటి శని, అర్థాష్టమి శని, అష్టమ శనిగ్రహ బాధలు తొలగుటకు శనీశ్వర స్వామికి తిల తైల అభిషేకాలు, బ్రహ్మ సూత్రం ఉన్న పరమ శివుడికి రుద్రాభిషేకాలు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుంచి శనీశ్వర స్వామిని, బ్రహ్మ సూత్రం ఉన్న పరమశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, ఆలయ సహాయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి, రేవల్లి శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వంగూరు, ఏప్రిల్ 20: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎంపీడీవో బిజయభాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దహార్తిని తీర్చడానికి చలివేద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. డీటీ వెంకటరమణ, ఎంఈవో శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించండి

కోడేరు, ఏప్రిల్ 20 : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సాయిబాబులు సంయుక్తంగా ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పారిశుధ్య పనులు చేసే కార్మికులు నాలుగు నెలలుగా వేతనాలు లేక పస్తులు ఉండాల్సి వస్తుందన్నారు. రోజంతా పని చేస్తే పూట గడుస్తుందని అలా రోజు పారిశుధ్య పనులు చేస్తూ రాత్రి ఇంటికి వెళ్లి పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. కుటుంబాలను పోషించుకోవడానికే పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని కాని నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని కుటుంబం, భార్య, పిల్లలు పస్తులు ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మండల పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు రాములు, కార్మికులు కృష్ణయ్య వెంకటయ్య, శ్రీను, రాములు, లక్ష్మీ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో

ఉప్పునుంతల, ఏప్రిల్ 20: మండల పరిధిలోని గట్టుకాడిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో సెంబర్లు నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాన్ని ఎండీవో లక్ష్మణ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని పోలింగ్ కేంద్రాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మా సమస్యలు ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ బహిరంగ సభ

అమ్రాబాద్, ఏప్రిల్ 20: అంబేడ్కర్ యువజన సంఘం అమ్రాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటలకు రాజ్యాంగ పరిరక్షణ అంశంపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు డి.ఎల్లస్వామి విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, దళిత సేన జాతీయ అధ్యక్షులు జేబీ రాజు, ప్రజా వాగ్గేయకారుడు జయరాజ్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, డాక్టర్ గోపీనాథ, సత్యానందం తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. నల్లమల ప్రాంతంలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రముఖ కళాకారుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే ఉపాధి అవకాశాలు

తెలకపల్లి, ఏప్రిల్ 20 : మారుతున్న పరిస్థితుల దృష్ట్యా భవిష్యత్తులో ప్రతి రంగంలో రాణించాలంటే ప్రతీ విద్యార్థికి సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం అవసరమని సీఎల్‌ఆర్ విద్యా సంస్థ కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డి, డైరెక్టర్ జిల్లెల రాజేందర్‌రెడ్డిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌జీ రెడ్డి జూనియర్ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, వ్యక్తిత్వ వికాసం తరగతులను డైరెక్టర్ జిల్లెల రాజేందర్‌రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల నుంచి కళాశాల విద్యార్థుల వరకు అందరూ కంప్యూటర్ శిక్షణ పొంది తగిన మెలకువలు నేర్చుకోవాలని కోరారు. ఆయనతోపాటు కళాశాల ప్రిన్సిపాల్ మర్యాద ప్రకాశ్‌రెడ్డి, సందీప్‌కుమార్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, విద్యా సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా పండ్ల పంపిణీ


రామాపురం గ్రామంలో ఉపాధి కూలీలకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు సుధాకర్

పెంట్లవెల్లి, ఏప్రిల్ 20 : కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో శనివారం ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు రామాపురంలో ఉపాధి కూలీలకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల నాయకులు ఆకునమోని చంద్రయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తాం'

పెంట్లవెల్లి, ఏప్రిల్ 20 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు చేసేంత వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్‌ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తామని చెప్పి ఇంత వరకు ఎలాంటి హామీలు అమలు చేయలేదని వారు పేర్కొన్నారు. సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, మాజీ సర్పంచ్ ఎస్‌కే.ఖాజా, బీఆర్‌ఎస్ నాయకులు రఫీయొద్దీన్, అబ్దుల్‌హుసేన్, కొండూరు ఎంపీటీసీ సభ్యుడు వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

తిమ్మాజిపేట, ఏప్రిల్ 20 : అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ప్రత్యేక అధికారి, పశువైద్యాధికారి డాక్టర్ శివరాజ్ సూచించారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని మరికల్ గ్రామపంచాయతీలోని గోదాం గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అంగన్‌వాడీ కేంద్రాలను అదేవిధంగా ఇటీవల చేసిన సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించి అందుకు సంబంధించిన వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలో రికార్డులను గుడ్డు, పరిమాణాన్ని పరిశీలించి అంగన్‌వాడీ కార్యకర్తకు పలు సూచనలు, సలహాలు చేశారు.

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ


ఆన్‌లైన్ వివరాలు పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్

తిమ్మాజిపేట, ఏప్రిల్ 20 : జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ తిమ్మాజిపేట మండల కేంద్రంలోని పశువైద్యశాలను, అదేవిధంగా మరికల్ గ్రామంలోని పశువైద్య ఉప కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో రికార్డులను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. పశువైద్యాధికారి డాక్టర్ శివరాజ్, సిబ్బంది తిరుపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉప్పునుంతల, ఏప్రిల్ 20: వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో వినోద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామంలోని రైతు వేదికలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కేంద్రాల వద్దకు తీసుకువచ్చి అమ్ముకోవచ్చునన్నారు. వడ్లు అమ్ముకోవడానికి రైతులు పట్టాపాసు బుక్, ఆధార్ కార్డు, అకౌంట్ పాస్‌బుక్ సంబంధిత అధికారులకు ఇచ్చి టోకెన్లు తీసుకోవాలన్నారు.

విద్యార్థులు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి, ఏప్రిల్ 20 : విద్యార్థులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శర్వాణీ కోరారు. మోడల్ డిగ్రీ కళాశాలలో మానవతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైబ్రరీకి రూ.35వేలతో అభివృద్ధి పర్చారు. శనివారం ప్రిన్సిపాల్ శర్వాణీ, జేఏసీ చైర్మన్ సదానందంగౌడ్, మానవతా ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ రమ్యాలు ప్రారంభించారు. ఫౌండేషన్ వలంటీర్లు సందీప్, మురళి, ప్రవీణ్, శ్రీరామ్, శ్రీమాన్, అనిల్ ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేడు సమావేశం

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 20: నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం పట్టణ సమీపంలోని పల్కపల్లి శివాలయం ఆవరణలో నిర్వహించే సమావేశానికి నియోజకవర్గంలోని బూత్ కమిటీ సభ్యులు పాల్గొనాలన్నారు. ఈ సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొననున్నట్లు తెలిపారు.